క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత తనిఖీ చేశారు. ఈసందర్భంగా చిన్నారుల హాజరు, సరుకుల పంపిణీ రికార్డులు పరిశీలించారు. ప్రతీ నెల స్పెషల్ గ్రోత్ మానిటరింగ్ చేయాలనే ఆదేశాల మేరకు తనిఖీ చేసినట్లు సూపర్‌వైజర్ పేర్కొన్నారు. టీచర్‌కు ఇచ్చిన మొబైల్‌లో కుటుంబ సర్వే, పిల్లల ఎత్తు, బరువు వివరాలు నమోదు చేయాలని సూచించారు.

నియామకాల్లో ప్రమాణాలు పాటించాలి

ఖానాపూర్: వైద్యశాఖలో చేపట్టే ఔట్‌సోర్సింగ్ నియామకాల్లో అవకతవకలకు తావు లేకుండా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టాలని ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శులు పీటర్, సురేందర్ అన్నారు. మంగళవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంతో మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని.. వారు నిరాశ చెందకుండా నియామకాల్లో ప్రమాణాలు పాటించాలని కోరారు. లేకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

లైన్‌మెన్ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న ఏఈ, సిబ్బంది

సోన్: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం లైన్‌మెన్ దినోత్సవం నిర్వహించారు. ఏఈ శ్రీనివాస్ లైన్‌మెన్లతో కలిసి కేక్ కట్ చేసి వారికి తినిపించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా లైన్‌మెన్లు కీలకపాత్ర పోషిస్తారని ఏఈ పేర్కొన్నారు. సహాయ ఇంజినీర్ విష్ణు, లైన్ ఇన్‌స్పెక్టర్ నారాయణసింగ్, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

నేటి నిరసనకు తరలిరావాలి

ఖానాపూర్: ఎల్‌ఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ ఈనెల 6న బుధవారం పట్టణంలోని తెలంగాణచౌక్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఎల్‌ఆర్‌ఎస్ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నుంచి రూ.20వేల కోట్లను దోచుకోవడమే లక్ష్యంగా చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. నిరసనకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

'ఆక్రమణ తొలగించాలి'

కడెం: మండలంలోని నర్సాపూర్‌తండా గ్రామంలో రోడ్డుకు అడ్డంగా వేసిన గుడిసెను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామస్తులతో కలిసి తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో అరుణకు వినతిపత్రం అందజేశారు. రోడ్డు ఆక్రమణతో పది కుటుంబాలకు రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న, ఏఐకెఎంఎస్ నాయకులు రాజేశ్, ఆకుల సత్తెన్న, రాములు తదితరులు ఉన్నారు.

ప్రజాసంఘాల కార్యాలయం ప్రారంభం

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీలో కామ్రేడ్ తలారి గంగన్న భవన్ పేరిట ప్రజాసంఘాల కార్యాలయాన్ని మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.పద్మ ప్రారంభించారు. సీఐటీయూ, వ్యవసాయ కార్మికసంఘం, రైతుసంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో పలు ప్రజా సమావేశాలను కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వాలు అవలంబించే కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్యంగా ఉంటూ ఉద్యమాలు చేయడం ద్వారా హక్కులు సాధించుకోవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో నూతన్‌కుమార్, బొమ్మెన సురేశ్, డాకూరి తిరుపతి, నాగెల్లి నర్సయ్య, తొడసం శంభు, దుర్గం పోషలింగం, సాయికిరణ్ ఉన్నారు.

'ఖానాపూర్‌లో బీఈడీ కళాశాల ప్రారంభించాలి'

ఖానాపూర్: నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్‌లో బీఈడీ కళాశాల లేక డిగ్రీ, పీజీ పూర్తి చేసిన యువత ఇబ్బంది పడుతున్నారని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నం శివాజీగౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రాంతంలోని నిరుద్యోగుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం బీఈడీ కళాశాలను ప్రారంభించాలని కోరారు.

ఎస్సైకి సన్మానం

కుంటాల: కుంటాల ఎస్సై వి.రజనీకాంత్‌ను మండలంలోని లింబా(కె) గ్రామ నాయకులు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో సన్మానించారు. ఎంపీటీసీ సునందగిరీశ్, మాజీ సర్పంచ్ ఆనందరావుపటేల్, మాజీ ఆత్మ చైర్మన్ అశోక్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ముక్కిన బియ్యం తినేదెలా?

- మూడు నెలలుగా రేషన్‌షాపులకు నాసిరకం బియ్యం
- ఇబ్బంది పడుతున్న లబ్ధిదారులు
- నాణ్యత పట్టించుకోని అధికారులు



నాసిరకంగా రేషన్ బియ్యం



ముధోల్‌లోని రేషన్ దుకాణం

ముధోల్: నిరుపేద కుటుంబాల ఆకలి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్‌కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తుంది. ప్రతి నెలా కార్డులోని ఒక్కో సభ్యుడికి ఆరు కిలోలను ఉచితంగా అందిస్తుంది. కానీ నియోజకవర్గంలోని ముధోల్, బాసర, తానూరు మండలంలోని గ్రామాల్లో రెండు, మూడు నెలలుగా రేషన్ డీలర్లు ముక్కిన బియ్యం సరఫరా చేస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము రోజు వండుకు తినే రేషన్ బియ్యం నాసిరకంగా రావడంతో ఏం చేయాలో తోచడం లేదని వాపోతున్నారు.

పర్యవేక్షణ ఏది..?

క్వాలిటీ కంట్రోల్ అధికారులు రేషన్ బియ్యాన్ని తనిఖీ చేసి నాణ్యమైనవని నిర్ధారించిన తర్వాతే రేషన్ దుకాణాలకు సరఫరా చేయాలి. కానీ ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో ముక్కిన బియ్యం సరఫరా అవుతున్నాయంటే అధికారులు సరిగ్గా పర్యవేక్షించనట్టు లెక్క. ముధోల్, బాసర, తానూరు మండలంలో 80 రేషన్ దుకాణాలున్నాయి.

ఈ మూడు మండలాల పరిధిలోని గ్రామాల్లో ఇదే సమస్య ఉందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని లబ్ధిదారులు వేడుకుంటున్నారు.

నష్టపోయేది పేదలే..

రేషన్ బియ్యం ఉపయోగించుకునే వారిలో నిరుపేదలే ఎక్కువగా ఉంటారు. బయట బియ్యం కొనలేక.. ఈ బియ్యంపైనే ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. కానీ ప్రభుత్వం నాసిరకం బియ్యం పంపిణీ చేస్తుండటతో వారు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. డీలర్లను అడిగితే మేమేం చేయాలి పైనుంచి వచ్చిందే ఇస్తున్నాం అంటున్నారని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ఈ బియ్యంలో సగం కంటే ఎక్కువ నూకలే దర్శనమిస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

తినలేకపోతున్నాం



రేషన్ షాపుల ద్వారా వచ్చే బియ్యాన్ని మేము తింటాం. కానీ గత మూడు నెలలుగా డీలర్లు ముక్కిన బియ్యం అందిస్తున్నారు. ఈ బియ్యాన్ని తినలేకపోతున్నాం.. మంచి బియ్యం సరఫరా చేయాలి. – సాయి, చించాల

రేషన్‌బియ్యమే దిక్కు..



ప్రభుత్వం అందించే బియ్యమే మా లాంటి పేదలకు దిక్కు. కానీ ఇప్పుడు అందిస్తున్న ముక్కిన బియ్యం వండుకొని తినలేకపోతున్నాం. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి. – ఎం. లక్ష్మి, తరోడా

మిల్లర్ల నుంచి వచ్చినవే పంపుతున్నాం

ముధోల్ గోడాం నుంచి బాసర, ముధోల్, తానూర్ మండలాల్లోని 80 రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేస్తాం. ప్రస్తుతం నాణ్యత లేని ముక్కిన బియ్యం వస్తున్న మాట వాస్తవమే. మిల్లర్ల నుంచి వస్తున్నవే మేం పంపుతున్నాం. ఇప్పటికే కొంత లోడ్ తిరిగి పంపించాం. మిగతా లోడ్‌ను కూడా తిరిగి పంపేలా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం.

– సత్యనారాయణ, పౌరసరఫరాల శాఖ గోదాంల ఇన్‌చార్జి, ముధోల్

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



గడపగడపకూ కాంగ్రెస్ కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు, శ్రీహరిరావు నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గడపగడపకూ కాంగ్రెస్ కరపత్రాలను డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, పార్లమెంట్ ఇన్‌చార్జి ఇసాక్ షేరు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని అధిక మెజారిటీతో గెలిపించి రాహుల్‌గాంధీకి బహుమతిగా ఇద్దామన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు నిత్యావసర ధరలు పెంచి ప్రజలపై భారం మోపాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అర్జుముంద్, యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు చరణ్‌గౌడ్, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు జునైద్, అజర్, శాంతన్‌రెడ్డి, చిన్ను, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్షద్, కిజర్, ఖానాపూర్ అసెంబ్లీ యూత్ కోఆర్డినేటర్ పొలంపెల్లి సచిన్, నరేశ్, శ్యామ్, అభిషేక్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తనీయొద్దు

పెంబి: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా మిషన్ భగీరథ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కవిత అధ్యక్షతన జరిగిన పెంబి మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గ్రామాల్లోని ప్రజాసమస్యలు పరిష్కరించేందుకు అధికారులు ముందుండాలని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థుల వార్షిక నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అంతకుముందు వేణునగర్‌లో గృహజ్యోతి పథకం ప్రారంభించారు. కోలాంగూడ గిరిజన గ్రామాల్లో పలువురి ఇళ్లపై ఉన్న త్రీఫేజ్ విద్యుత్ తీగలు తొలగించి ప్రజలకు ఇబ్బంది లేని చోట ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం రాముగూడలో అంగన్‌వాడీ కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగారెడ్డి, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీవో రమాకాంత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వప్నీల్ రెడ్డి, శంకర్, రాజన్న, అశోక్‌రావు తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల సైన్స్‌ఫేర్



ప్రయోగం పరిశీలిస్తున్న ఎంఈవో సుభాశ్

తానూరు: మండల కేంద్రంలోని కల్యాణ మండపంలో మంగళవారం స్థానిక వాగ్దేవి పాఠశాల విద్యార్థులు సైన్స్‌ఫేర్ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ సైన్సు దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులు తయారు చేసిన పరికరాలను ప్రదర్శించి వాటి ప్రయోజనాలను వివరించారు. దీనికి ఎంఈవో సుభాశ్ హాజరై ప్రయోగాల వివరాలు తెలుసుకొని విద్యార్థులను అభినందించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరవింద్‌రెడ్డి, అవినాష్, ఎస్సై సందీప్, భైంసా వేదం పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, మాధవ్‌రావ్ పటేల్, శివాజీ పటేల్, విద్యార్థుల పోషకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విజేతకు బహుమతి అందిస్తున్న చైర్మన్, డాక్టర్లు

నిర్మల్‌టౌన్: క్రీడలతో మానసికోల్లాసం కల్గుతుందని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. పట్టణంలోని శాంతినగర్ జీవీఎస్‌ఆర్ స్కూల్ మైదానంలో లక్కీ క్రికెట్ ఆధ్వర్యంలో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. మంగళవారం ఫైనల్ పోటీలకు చైర్మన్ హాజరయ్యారు. మొత్తం 44 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో షేక్ సాహెబ్‌పేట్ విజేతగా.. నిర్మల్ క్రికెట్ క్లబ్ రన్నరప్‌గా నిలిచింది. ప్రథమ బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బాహుమతి రూ.15 వేలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్లు నరసింహారెడ్డి, మనోజ్ భారత్, అరుణ్‌కుమార్, నిర్వాహకులు సుదర్శన్ ఉన్నారు .

సంక్షిప్త వార్తలు

జీరో బిల్లులు అందజేత

కుంటాల: గృహజ్యోతి పథకంలో భాగంగా మంగళవా రం మండలంలోని లింబా(కె)లో విద్యుత్ వినియోగదారులకు కాంగ్రెస్ నాయకులు జీరో బిల్లులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సునంద గిరీశ్, మాజీ సర్పంచ్ మోరె ఆనందరావుపటేల్, ఆత్మ మాజీ చైర్మన్ అశోక్‌రెడ్డి, కాంగ్రెస్ యూత్ మండలాధ్యక్షుడు మహేందర్, న్యాయవాది నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఖానాపూర్: నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. మంగళవారం పట్టణంలోని ఏసీఈ పాఠశాలలో ఆరో వార్డు నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓటరు సంకల్ప పత్రాలను అందజేశారు. అనంతరం నూతన చైర్మన్, వైస్‌చైర్మన్‌ను కాలనీవాసులు, పాఠశాల యాజమాన్యం, బోయ వాల్మీకి సంఘం, గౌడ కులసంఘాల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కావలి సంతోష్, కమిషనర్ మనోహర్, అమానుల్లాఖాన్, షబ్బీర్‌పాషా, అబ్బుభాయ్, కుతుబుద్దీన్, నిమ్మల రమేశ్, శంకర్, కిశోర్‌నాయక్, రవి, వేల్పుల రమేశ్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్సు ప్రయోగశాల నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారని లక్ష్మణచాంద తాజా మాజీ సర్పంచ్ ముత్యంరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

శ్రీశైలం బయలుదేరిన స్వాములు

కుంటాల:మండలంలోని దౌనెల్లి గ్రామానికి చెందిన పలువురు శివస్వాములు 41 రోజులపాటు మాలధరణ చేశారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలంలోని మల్లికార్జున స్వామి దర్శనానికి మంగళవారం బయలుదేరివెళ్లారు. అంతకుముందు శివాలయం, హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయగా మహిళలు మంగళహారతులతో సాగనంపారు.

పలువురు ఎస్సైల బదిలీ

నిర్మల్‌టౌన్: పట్టణ ఎస్సై శంకర్‌ను పెంబి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ మంగళవారం ఎస్పీ జానకి షర్మిల ఉత్తర్వులు జారీ చేశారు. శంకర్ స్థానంలో నిర్మల్ సీసీఎస్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న అశోక్‌ను పట్టణ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

ఖానాపూర్: ఖానాపూర్ ఎస్సై లింబాద్రి భైంసా రూరల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. భైంసారూరల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న శ్రీకాంత్ బదిలీపై ఖానాపూర్ రానున్నారు.

కడెం: కడెం ఎస్సై కొసన రాజును లోకేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో సారంగపూర్ ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి కడెంకు రానున్నారు.

పెండింగ్ దరఖాస్తులు పరిశీలన

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ, కుస్లి గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ అధికారులు ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ వాహిదొద్దీన్, ఆర్‌ఐలు వేణుగోపాల్, సుమలత, రైతులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

లోకేశ్వరం: మండలంలోని పిప్రి గ్రామంలో మంగళవారం ఉపాధి నిధులు రూ.4 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. సుధీర్‌రెడ్డి, ముత్యంరెడ్డి, సాయన్న, గుప్త చిన్నయ్య, అనిల్, విలాస్, రవి పాల్గొన్నారు.

పాతఎల్లాపూర్‌వాసికి డాక్టరేట్



డాక్టరేట్‌తో రాజేందర్

ఖానాపూర్: మండలంలోని పాతఎల్లాపూర్ గ్రామానికి చెందిన మోటివేషనల్ స్పీకర్ బోండ్ల రాజేందర్‌కు ఢిల్లీలోని ఏషియన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన స్నాతకోత్సవంలో డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. ఉద్యోగం చేస్తూనే ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎమ్మెస్సీ సైకాలజీ, ఎంబీఏ పూర్తిచేశాడు. మోటివేషనల్ స్పీకర్‌గా తెలుగు రాష్ట్రాల్లో 600లకు పైగా సెషన్స్ పూర్తి చేసి నాలుగు లక్షల మంది విద్యార్థులకు మార్గనిర్దేశనం చేశారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ట్రైనింగ్ అంశంపై రెండు వేలకు పైగా వీడియోలు యూట్యూబ్‌లో అప్లోడ్ చేశారు.

మహిళలు వైద్యపరీక్షలు చేయించుకోవాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఇద్రీస్ గౌరీ

కుంటాల: ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందించే ఎనిమిది రకాల వైద్యపరీక్షలను మహిళలు చేయించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇద్రీస్‌గౌరీ అన్నారు. మంగళవారం కుంటాల పీహెచ్‌సీని డిప్యూటీ డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు, వైద్యసేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట వైద్యురాలు శృతిరెడ్డి, సీహెచ్‌వో గిరిబాబు తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



కుంటాల: కుంకుమార్చనలో మహిళలు



భైంసారూరల్: మహాగాంలో పాల్గొన్న భక్తులు

కుంటాల: మండలంలోని శ్రీ పాండురంగ విఠల రుక్మాబాయి ఆలయ ప్రథమ వార్షికోత్సవం కొనసాగుతోంది. వేద పండితులు శ్రీ భగవాన్‌జోషి ఆధ్వర్యంలో మంగళవారం వేదపఠనం, కర్మణ పుణ్యాహవచనం, మండపాంగ ఆరాధన హోమం, రుద్రస్వంగ కారం, కుంకుమార్చన, చండీ హోమం, హారతి, మంత్రపుష్పం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. గందె పరివారం కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠాపన

భైంసారూరల్: మండలంలోని మహాగాం శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మంగళవారం త్రియంబకేశ్వర ఆలయంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే నారాయణరావుపటేల్ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షులు రాంచంద్రారెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్యాంరావుపటేల్, ఒంప్రకాశ్, శంకర్‌చంద్రే, సట్వాజీ, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

సోన్: మండలంలోని కడ్తాల్‌లో పోచమ్మ ఆలయం వద్ద మంగళవారం చండీయాగం, శాంతి హోమం నిర్వహించారు. ఈసందర్భంగా వేద పండితులు కలశ స్థాపన గణపతి హోమం, రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. అంతకుముందు గంగాజలం తీసుకొచ్చి ఆలయాన్ని శుద్ధి చేశారు. గ్రామపెద్దలు పాల్గొన్నారు.

విజ్ఞానం-వికాసం

- ఆలోచింపజేసిన విద్యార్థుల ప్రదర్శనలు
- ఒక్కరోజు జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఒక్కరోజు సైన్స్‌ఫేర్ కార్యక్రమం ముగిసింది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు తమ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. వ్యవసాయం, విద్యుత్తు, రవాణా, సోలార్ తదితర అంశాలపై విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు ఆలోచింపజేశాయి. ప్రారంభ వేడుకలకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు హాజరవగా... ముగింపు వేడుకలకు ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు విభిన్నంగా ఉన్నప్పటికీ వాటిలో కొన్ని..

సర్వరోగ నివారిణి.. గోధుమ గడ్డి



విద్యార్థులపేర్లు: అమూల్య, భవిత (ఏడో తరగతి), యూపీఎస్ గంజాల్, మం.సోన్
గైడ్‌టీచర్: రమేశ్‌కుమార్

ఆధునిక జీవనశైలి వ్యు ల్యమాని ప్రస్తుతం ఎన్నో రోగాలు దరి చే రుతున్నాయి. గోధుమ గడ్డి రసంతో రోగనిరోధక శక్తి పెరిగి మనిషి ఆరోగ్యవంతుడవుతాడని విద్యార్థులు పేర్కొన్నారు. డబ్బాలో గోధుమ గింజలు నాటి నేలరోజులు నీరు అందిస్తే గోధుమగడ్డి పెరుగుతుంది. ఆ గడ్డిని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసి రసం తయారు చేసుకొని తాగితే రోగాల బారిన పడకుండా ఉండవచ్చని విద్యార్థులు వివరించారు. కరోనా వేళ ఈ గడ్డి ఎందరినో రక్షించిందని వివరించారు.

సూక్ష్మ వ్యవసాయ పద్ధతి



విద్యార్థిపేరు: రిషిత్ చారి, తొమ్మిదో తరగతి, జెడ్పీహెచ్ఎస్ బీర్‌నంది, మం.ఖానాపూర్
గైడ్‌టీచర్: నరేంద్ర కుమార్

పంటలకు నూతన పద్ధతిలో సాగు నీరు అందించే విధానమే సూక్ష్మ వ్యవసాయ పద్ధతి. ఐఓటీ బేస్డ్ ఇరిగేషన్ పద్ధతిలో ఈ పరికరాన్ని కరెంట్ మోటార్‌కు అనుసంధానించి పొలాలకు నీరు అందించవచ్చు. పొలం చివరి మడి వద్ద రెండు సెన్సార్లు.. రెండు తీగల ద్వారా స్టార్టర్‌కు అనుసంధానిస్తే అవసరమైనప్పుడు మొక్కలకు నీరు అందించవచ్చు. చివరి మడి వరకు నీరు అందగానే సెన్సార్లకు తడి తగిలి మోటారు ఆటోమేటిక్‌గా ఆఫ్ అయిపోతుంది. నీరు, కరెంట్ ఆదా అవడమే కాక పొలానికి వెళ్లకుండా పంటకు నీరు అందించవచ్చు.

స్మార్ట్ డస్ట్‌బిన్



విద్యార్థిపేరు:జి.రాకేశ్ (తొమ్మిదోతరగతి), జెడ్పీహెచ్ఎస్ ఖానాపూర్
గైడ్‌టీచర్: టి.గంగన్న

డస్ట్‌బిన్‌లో చెత్త పారేయడం దినసరి చర్య. కాగితం కానీ వృథా వస్తువు కానీ డస్ట్‌బిన్‌లో పడేయాలంటే దగ్గరికి వెళ్లి మూత తెరిచి అందులో వేయాల్సి ఉంటుంది. కానీ ఈ విద్యార్థి సెన్సార్ల సాయంతో డస్ట్‌బిన్ మూత తెరవకుండానే దీనిని ఉయోగించే విధానం తయారు చేశాడు. అంధులు, వృద్ధులు, చిన్నారులకు ఇది ఉపయోగకరంగా ఉంటుంది. ఈ విధానంతో డస్ట్ బిన్ ముందుకు మనిషి వెళ్లగానే సెన్సార్ ద్వారా దాని మూత తెరుచుకుటుంది. బాక్స్‌లో చెత్త వేసి పక్కకు జరగగానే మూత కిందకు పడుతుంది. మనం ఉపయోగించే చిన్న చిన్న పరికరాలతో దీనిని తయారు చేసినట్లు రాకేశ్ వివరించారు.

పల్లెటూరు- పట్నం వాతావరణం



విద్యార్థి పేరు: మనితేజ, అభిలాష్ (ఏడోతరగతి) జెడ్పీహెచ్ఎస్, అష్ట, మం.కుభీర్
గైడ్ టీచర్: సాయిరెడ్డి

పల్లెటూరు వాతావరణం- పట్నం వాతావరణాన్ని పోలుస్తూ చిన్నచిన్న అట్ట ముక్కలతో ఈ విద్యార్థులు సుందరంగా ప్రాజెక్టును రూపుదిద్దారు. స్వచ్ఛమైన గాలి, నీటి కాలుష్యం, తాజా కాయగూరలు, పంట పొలాలు తదితర పల్లెటూరు వాతావరణం ప్రతిబింబించేలా చిత్రాలను రూపొందించారు. అలాగే పట్టణ వాతావరణంలో కలిగే నష్టాలను జలకాలుష్యం, శబ్ద కాలుష్యం, కల్తీ ఆహారం తదితర అంశాలను కూడా కళ్లకు కట్టినట్లు వివరించారు.